క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన సీఐ



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలోని పోలింగ్ బూత్‌లను సీఐ దుర్గాప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ హైస్కూలు, జూనియర్ కాలేజీ ప్రాంగణాలలో ఉన్న బూత్‌లను పరిశీలించి స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

జగనన్న కాలనీల పురోగతిపై సమీక్ష

చీమకుర్తి: సంతనూతలపాడులోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను స్పెషలాఫీసర్ ఉషారాణి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి శుక్రవారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

పీవీకి భారతరత్న ఇవ్వడంపై హర్షం

ఒంగోలు మెట్రో: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై పలువురు సాహిత్యవేత్తలు, కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు. ప్రముఖ సాహిత్యవేత్త నెమ్మాని సీతారామమూర్తి, ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, ఎర్రణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాదు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి అధ్యక్షుడు నూనె అంకమ్మరావు, రంగభూమి కళాకారుల సంఘం అధ్యక్షుడు ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు.

శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రవణా నక్షత్ర పూజలు



స్వామివారు, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రవణా నక్షత్ర పూజలతో పాటు శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నాద నీరాజనం చతుర్వేద పారాయ, విష్ణు సహస్ర నామ పారాయణ, ఆధ్యాత్మిక సంకీర్తన ఆలాపన జరిగాయి. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొండవీడు ఫెస్ట్‌లో సాహస కృత్యాలకు అవకాశం



కొండవీడు ఫెస్ట్-2024 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్న కొండవీడు ఫెస్ట్-2024లో చారిత్రక విశేషాలను వీక్షించడంతో పాటు సాహస కృత్యాలకు అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు.

పల్నాడు జిల్లా కొండవీడు కోటపై జరిగే కొండవీడు ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. హెలీరైడ్, పారామోటారింగ్, హాట్ ఎయిర్ బెలూన్, రాక్ క్లైంబింగ్, కయాకింగ్ బోటింగ్, హార్స్ రైడింగ్, సైకత శిల్ప ప్రదర్శన, డ్యాన్స్ పోటీలు, చిల్డ్రన్ ప్లే ఎగ్జిబిషన్, ఫ్లవర్‌షో, చారిత్రక ఫొటో ఎగ్జిబిషన్, ఫుడ్ ఫెస్ట్ ఉంటాయని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనేలా నిర్వాహకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 86886 28881, 98854 74340 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

రోడ్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



కొత్తపట్నం రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి



విద్యుత్ లైన్లు వేయడానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీలు మోహన్‌రావు, అంజిరెడ్డి

- కొత్తపట్నంలో డివైడర్, లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తా
- ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి

కొత్తపట్నం: కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి పల్లెపాలెం వరకు రూ.2.75 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి తెలిపారు. శుక్రవారం కొత్తపట్నం చేరుకుని రోడ్డు విస్తరణ పనులను ఆమె పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ డివైడర్, డివైడర్ మధ్యలో ఐరన్ పోల్స్, లైటింగ్ గురించి పూర్తి స్థాయిలో చర్చించారు. ఈ సందర్భంగా మీనాకుమారి మాట్లాడుతూ ముందుగా ఒకవైపు రోడ్డు పూర్తి చేసుకుంటే వెంటనే డివైడర్ పనులను తాము ప్రారంభిస్తామన్నారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఒకవైపు ఖాళీ వదలాలన్నారు. రోడ్డు అభివృద్ధికి ఎంత అవుతుందో ఒడా ద్వారా ఎస్టిమేషన్ వేసి నిధులు మంజూరు చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆక్రమణలు తొలగించడం ఎంతో బాగుందని, ఇంతకుముందు తాము బీచ్‌కు రావాలంటే ఎంతో భయపడేవారిమని అన్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడేవారని గుర్తుచేశారు. ఇప్పుడు బాగుందని, రోడ్డు వేస్తే ఇంకా బాగుంటుందని, త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. డివైడర్ వేస్తే ప్రమాదాలు కూడా నియంత్రించవచ్చని అన్నారు. కొత్తపట్నం కొత్తదనంగా ఉందని స్థానికులను అభినందించారు. కార్యక్రమంలో గొరవరపు శివాజీ, తంబి సురేష్, మరపాల సుధాకర్‌రెడ్డి, వాసు, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లను పరిశీలించిన అధికారులు...

కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని విద్యుత్ ఆపరేషన్ ఏడీ రాయపూడి మోహన్‌రావు, కంజక్షన్ ఏడీ అంజిరెడ్డి, కాంట్రాక్టర్ ఉప్పల నాగాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. మోహన్‌రావు స్థానికులను పిలిపించి విద్యుత్ లైన్ల గురించి పూర్తి స్థాయిలో చర్చించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుకు రెండు వైపులా విద్యుత్ స్తంభాలు వేసి లైన్ లాగుతామన్నారు. విద్యుత్ లైన్ పక్కనే వాటర్ పైపులైన్, దాని పక్కనే డ్రైనేజీ, దాని పక్కనే రోడ్డు మార్జిన్ రెండు పక్కలా వస్తుందని వివరించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు లైన్లను పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి నల్లూరి గార్డెన్ దగ్గరలో ఉన్న ఆర్చి వరకు రెండు వైపులా లైను వేయాలని కాంట్రాక్టర్‌కు వివరించారు. స్పన్ పోల్స్, 9.1 పోల్స్ రెండు వైపులా వస్తాయని, సుమారు 100 పోల్స్ దాకా వేస్తామని తెలిపారు. సుమారు 3 కిలో మీటర్ల లైన్ వేయాల్సి వస్తుందన్నారు. విద్యుత్ లైన్ రెండు వైపులా వేయడం వలన గృహ యజమానులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నాణ్యమైన విద్యుత్ కూడా సరఫరా అవుతుందని తెలిపారు. లైన్ వేయడానికి గృహాలు అడ్డురాకుండా తొలగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా 11 కేవీ తీగ తగిలితే గృహం మొత్తం విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ రోడ్డులో కొత్త స్తంభాలు, కొత్త వైర్లు, కొత్త మెటీరియల్‌తో లైన్ వేయడం ఎంతో అదృష్టమన్నారు. ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా విద్యుత్ లైన్ వేయడానికి సహకరించాలని మోహన్‌రావు కోరారు. సోమవారం నుంచి పనులు ప్రారంభించి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ నటరాజు, టెక్నికల్ అసిస్టెంట్ మాధవరావు, డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు, తంబి కాంతారావు, గొరవరపు శివాజీ, తంబి సురేష్, రామలింగం సుధాకర్‌రెడ్డి, తంబి వెంకటేశ్వర్లు, వరప్రసాద్‌రావు, కోటేశ్, అక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం



కోనేరులో నిర్వహిస్తున్న తెప్పోత్సవం

మడనూరు (కొత్తపట్నం): మడనూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న కోనేరులో స్వామివార్ల తెప్పోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో రమణారెడ్డి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించగా, భక్తులు భారీగా పాల్గొన్నారు. ముందుగా కోనేరులో బోర్లతో నీరు నింపి కోనేరు చుట్టూ విద్యుత్ లైట్లతో అలంకరించారు. కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామి వార్లను ఈతముక్కల గ్రామం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మడనూరు రామలింగస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. ఎదురుగా ఉన్న కోనేరు ఒడ్డున ఉంచి కోనేరులో సిద్ధం చేసిన తెప్పలో రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామిలను ఉంచారు. తెప్పలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తమల పాకులపై కర్పూరం వెలిగించి కోనేరులో వదిలారు. తెప్పలో ఉన్న రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామికి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం కన్నేశ్వరస్వామి, కోదండరామస్వామికి ఈతముక్కల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. మడనూరులో రామలింగేశ్వరస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. కోనేరులో నిర్వహించిన తెప్పోత్సవాన్ని భక్తులు కోనేరు చుట్టూ తిరిగి తిలకించారు. వచ్చిన భక్తులు కోనేరు ముందు టెంకాయలు కొట్టి తమల పాకులపై కర్పూరం పెట్టి వెలిగించి కోనేరులో వదిలి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా ఆనవాయితీ ప్రకారం బ్రహ్మోత్సవాలు ముందుగా వచ్చే అమావాస్య రోజున తెప్పోత్సవం జరపాల్సి ఉందన్నారు. అందులో భాగంగా రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వాములను అలంకరించి తెప్పోత్సవం నిర్వహించినట్లు వివరించారు. మార్చి 7 నుంచి 11 వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేత్రపర్వంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: ప్రతి మాసంలో వచ్చే కలియుగ వెంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం శుక్రవారం రావడంతో ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామిని శోభాయమానంగా అలంకరించి రథంపై ఊరేగించారు. స్వామివారి ఉత్సవమూర్తులను గోవింద నామాలు చదువుకుంటూ శంకు చక్ర త్రిపుండ్రాలను చేతబట్టి ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణగుప్తా జంధ్యం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఒంగోలు నగరంలో శ్రీగిరి పాదపీఠం వద్ద గల బాపూజీ గోసంరక్షణ సంఘం గోశాల నుంచి ప్రారంభమైంది. కోర్టు సెంటర్ సీవీఎన్ రీడింగ్ రూమ్, కేశవస్వామి దేవాలయాల మీదుగా భగీరథ సెంటర్, శర్మ కాలేజీ గ్రౌండ్, గద్దలగుంట దాటుకుని శ్రీగిరి చేరిన భక్త బృందం కలియుగ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆనందాన్ని పొందారు. గోవింద నామస్మరణ మార్మోగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలి



మద్దిపాడు కేవైజీహెచ్‌సీలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న డాక్టర్లు



కరవదిలో డీ వార్మింగ్ డే నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్, అధికారులు

మద్దిపాడు: నులి పురుగుల నివారణకు 1-19 సంవత్సరాల్లోపు బాలబాలికలు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని డాక్టర్ ఆనందమోహన్ సూచించారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులందరితో అల్బెండజోల్ మాత్రలు మింగించారు. మండలంలో 19 సంవత్సరాలలోపు వారు 10,302 మంది ఉండగా, వారిలో శుక్రవారం సాయంత్రానికి 9,704 మందితో అల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే విజయవంతం

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. కరవది పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో, త్రోవగుంట అర్బన్ హెల్త్ సెంటర్‌లోని అన్ని ప్రాంతాల్లో వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్, వలంటీర్లు విజయవంతంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థులతో అల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. తొలుత పరిశుభ్రంగా చేతులు కడిగించి స్పూను ద్వారా మాత్రలు నోటిలో వేసి మింగించారు. కరవది జిల్లా పరిషత్ హైస్కూల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి ఆధ్వర్యంలో సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, కార్యదర్శులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ హైస్కూలులో హెచ్‌ఎం రవికుమార్, ఉలిచిలో జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో, గుండాయపాలెంలో హెచ్‌ఎం రామారావు, త్రోవగుంట హైస్కూల్లో చల్లా బ్రహ్మయ్య, ముక్తినూతలపాడు హైస్కూల్లో హెచ్‌ఎం దేవసేన మాత్రలు మింగించే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించారు.

ఏపీ జేఏసీ అమరావతి మహిళా కమిటీ ఎంపిక



కలెక్టర్ దినేష్‌కుమార్‌తో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా మహిళా కమిటీ సభ్యులు

ఒంగోలు అర్బన్: ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, కలెక్టరేట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీ మహిళా సభ్యులను ఎంపిక చేశారు. ఎంపికైన సభ్యులు శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. చైర్‌పర్సన్‌గా ఎస్.జయలక్ష్మి, అసోసియేట్ చైర్‌పర్సన్‌గా పి.ఉమాదేవి, కో చైర్‌పర్సన్లుగా అన్వర్‌జాన్, కరీమున్నీషాబేగం, శివకుమారి, రజని, జనరల్ సెక్రటరీలుగా సీహెచ్ శ్రీదేవి, సాబిరూన్, రమాదేవి, రాధ, తిరుపతమ్మ, ట్రెజరర్‌గా శాంతిప్రియ ఎంపికయ్యారు.

మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం

- ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావు



బసవరావుతో కలిసి కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల నాయకులు

మద్దిపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావు పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు కుట్రపూరితంగా అందరూ ఏకమై జగనన్నపై దాడికి యత్నిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని అన్నారు. సీఎంగా జగనన్న ఉంటే పేద, బడుగు, బలహీనవర్గాలకు ముఖ్యంగా మహిళలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. జగనన్న నినాదం వైనాట్ 175కు మద్దతుగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ పాదయాత్ర చేస్తున్న ఆయన.. గురువారం రాత్రి మద్దిపాడు చేరుకున్నారు. మద్దిపాడులో రాత్రి బసచేసి శుక్రవారం ఉదయం పాదయాత్ర మొదలు పెట్టి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు వచ్చే సరికి 11 వందల కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయనను కొరిశపాడు మండలంలోకి సాగనంపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు గుడ్లపాతల రవి, రాయపాటి విల్సన్, పోతినేని శ్రీనివాసరావు, అన్వేష్, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, అశోక్, పలువురు పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

క్విస్ కాలేజీలో ముగిసిన ఫెస్ట్



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

ఒంగోలు: క్విస్ కాలేజీలో మూడురోజులు నిర్వహించిన ఫెస్ట్ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి జీవితం యాంత్రికంగా ఉండరాదన్నారు. విద్యార్జనతోపాటు ఆనందంగా గడపడం కూడా జీవితంలో ఒక భాగమేనని గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులు తరగతి గదుల సరిహద్దులను అధిగమించి ఇటువంటి ఫెస్ట్‌లలో చురుగ్గా పాల్గొనాలని, అకడమిక్, కోకరిక్యులర్ కార్యకలాపాల మధ్య సమతుల్యతను సాధించడం నేర్చుకోవాలని అన్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన అనేక ప్రాజెక్టులు సమాజ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ ఎల్.భారతి మాట్లాడుతూ ఫెస్ట్‌లో రాష్ట్రంలో 68 కాలేజీల నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. క్విస్ గ్రూప్ విద్యా సంస్థల కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రి, కాలేజీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ చక్రవర్తి, రిటైర్డ్ ఇస్రో డైరెక్టర్ డాక్టర్ బీవీ సుబ్బారావు, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దక్షిణామూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఫెస్ట్ విజేతలకు రూ.3.50 లక్షల విలువైన బహుమతులను అతిథుల చేతులమీదుగా అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ఒంగోలు: డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. 9959225695 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వారధిలా పనిచేయండి

ఒంగోలు రూరల్: ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వారధిలా ఉద్యోగులు పనిచేయడం వలన అర్హులైన వారందరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం చేరుతుందని కరవది నూతన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. నూతనంగా కరవది కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా గ్రామ సమస్యలపై అవగాహన కోసం శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు వారి గృహాల పరిధిలోని సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంగా గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. తొలుత సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయడం అలవరచుకోవాలని సూచించారు. కుల గణన సర్వేలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తొలుత సర్పంచ్ కోటేశ్వరరావు, కార్యదర్శి-2 వేమా శ్రీలక్ష్మి మాట్లాడారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని, పీహెచ్‌సీ, సబ్‌స్టేషన్‌ను సర్పంచ్ కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న మహబూబ్‌జాన్

ఒంగోలు: పదో తరగతి విద్యార్థులకు ముస్లిం రచయితల సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్ శుక్రవారం ఉచితంగా పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. 10వ తరగతి పరీక్షల్లో సెయింట్ థెరిస్సా పాఠశాలలో చదువుతూ 500 మార్కులు దాటిన ప్రతి ఒక్క విద్యార్థికి వెయ్యి నూటపదహారు రూపాయల నగదు పారితోషికాన్ని అందిస్తానని ప్రకటించారు. పాఠశాల హెచ్‌ఎం దొంతు ఆనందరావు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ముస్లిం రచయితల సంఘ కార్యదర్శి షేక్ హుమయూన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.